వారు. చలిగాలి విపరీతంగా వీచసాగింది.

పది నిమిషాలు గడిచాయి. ఇంతలో పక్కనుంచి ఎవరో తలుపు తడుతున్న శబ్దం వినిపించి "రోజర్స్, మేరీ" ఆశ్చర్యపోయారు. "ఆ రాత్రివేళ ఎవరు తమ కారు తలుపు తడుతున్నారా?" అని కారు డోర్ తెరవబోయిన రోజర్స్‌ని వారించి నెమ్మదిగా మేరీ కిటికీకున్న అద్దంలోంచి రోడ్డువైపు చూసింది.

అక్కడి రోడ్డుమీద కారు పక్కగా ఆ రెండు 'అదృశ్య హస్తాలు' కనబడడంతో "కెవ్వు'మని అరచిందామె.

"రోజర్స్" కూడా ఆ చేతులను చూడడం జరిగింది. భయపడిన మేరీ "జీసెస్"ని స్మరించడంతో ఆ చేతులు అదృశ్యమయ్యాయి. 1920వ సంవత్సరంలో మొదలైన "అదృశ్య హస్తాల" గురించి ఎన్నో రకాలుగా విచారణలు జరిపిన అనేక దేశస్థులు ఆ సంఘటన నిజమని నిర్ధారించారు. కథ అని కొట్టి పారేసిన చాలా మంది వ్యక్తులు కూడా ఏదో ఒక పరిస్థితుల్లో ఆ చేతుల్ని చూడడం సంభవించి ఆ సంఘటన నిజమని నమ్మక తప్పలేదు!

చిట్టచివరికి అసలు అదృశ్య హస్తాలు ఎవరివి అనే నిజం బయటపడింది. 1919వ సంవత్సరం సెప్టెంబర్ నెలలో ఆదే రోడ్డుమీద జరిగిన ఘోరమైన యాక్సిడెంట్‌లో "డిక్ కెల్లీ" అనే వ్యక్తి తన రెండు చేతులు మోచేతుల వరకు తెగిపోయి తీవ్ర రక్తస్రావం జరిగి మరణించడం జరిగింది. యాక్సిడెంట్ జరిగిన సుమారు 9 గంటల తరువాత 'డిక్ కెల్లీ' ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించాడు. చేతులు తెగిపోయిన 'కెల్లీ' శవాన్ని ప్రభుత్వ అధికారులు అలక్ష్యంతో చేతులు లేకుండానే దహనం చేసేశారు. ఆ రోజునుండే ఆ "అదృశ్యహస్తాలు" అక్కడి జనాన్ని భయపెట్టడం మొదలు పెట్టింది!

అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి పొందిన బ్రిటన్ దేశంలో ఈ నాటికీ ఇటువంటి సంఘటనలు జరుగుతుండడం దేశ విదేశస్థులందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతోంది!

మానవుడికీ, ప్రకృతికీ మధ్య సాగుతున్న అనేక రకాల పోరాటాల్లో ఎప్పటికీ విజయం మాదేనని కొన్ని ప్రాకృతిక శక్తులు ఇలాంటి సంఘటనల ద్వారా చేస్తున్న ఛాలెంజిని మానవుడు ఏ విధంగా ఎదుర్కోగలడు?

దానికి సమాధానం ఒక్కటే! వెలుతురున్న చోట చీకటి వుండాలి! మంచి వున్న చోట వుండాలి! భగవంతుడ్ని నమ్ముతున్న మనం ఈ అదృశ్య శక్తుల్ని నమ్మాలి! తప్పదు!



## మా అత్తగారి కథ

చిన్న కథ

అవి మా అత్తగారు వాళ్ళు 1953 సం.ము. నాందేడ్‌లో వుంటున్న రోజులు. ఎప్పటిలాగానే ఆ నెల మొదటి తారీఖునే మామయ్యగారు జీతం అందుకుని హడావిడిగా ఆ జీతం మొత్తాన్ని అత్తగారి చేతిలో పెట్టారు. అవి అన్నీ రూపాయి నోట్లు. బాగా పాతబడి వున్నాయి. అవి చూసి అత్తగారు "అలాంటివి ఎందుకు తీసుకున్నారు. వాళ్ళేమన్నా వూరికే ఇస్తున్నారా, నెల కష్టానికి ఇదేనా ఫలితం" అంటూ మామగారి మీద విరుచుకు పడ్డారు. అప్పటికి ఆయన ఎలాగో సమాధానపరిచారు.

మరునటి రోజు మామగారు తమ్ముడి చదువుకోసం కాకినాడ ఎం.ఓ. చేయడానికి కూచున్నారు. అత్తకారి నుండి రు.నలభై తీసుకున్నారు. ఆయన ఆ పని చేస్తున్నంతసేపు అత్తగారు సాధిస్తూనే వున్నారు. కారణం ఆ నోట్లు మరిదిగారికి పంపిస్తే అతను ఇబ్బంది పడతారని, కష్టపడాల్సి వస్తుందని ఆవిడ బాధ. కాని ఇవేమి పట్టించుకోకుండా మామగారు ఎం.ఓ. చేశారు.

ఆ తరువాత ఎక్నాలెడ్జ్‌మెంట్ రావడం, దానితో బాటుగా మరిది వ్రాసిన ఉత్తరం రావడం, అందులో ఆ నోట్లను ఎవరూ తీసుకోవడం లేదని కొంచెం ఇబ్బందిగా వుంటోందని వ్రాయడం జరిగింది. ఇంక అది చదివిన అత్తగారి పరిస్థితి వర్ణించవీలుగానిది. ఆవిడ తిరులో మళ్ళీ మామగారిని సాధించడం మొదలు పెట్టారు. ఏమంటే "నేను మీకు ముందే చెప్పాను. ఆ నోట్లు పంపవద్దని. మళ్ళీ డబ్బు పంపేవరకు అతను అక్కడ ఏమి ఇబ్బంది పడతాడో అని.

వెంటనే మావగారి కోసం లెటర్ వ్రాయడానికి కూర్చున్నారు. "నేను వద్దంటున్నా ఆ నోట్లు నీకు పంపారు. అవి వెంటనే తిరిగి పంపించేయి. వేరే నోట్లు పంపతామని" ఆ ఉత్తరం సారాంశం.

పాపం ఆవిడకి అప్పుడు ఎం.ఓ. పనితీరు తెలియదు. ఆవిడకి తెలిసిందల్లా అవతల మరిదికి ఇబ్బంది అవుతుందని. అది ఆవిడ సహృదయం. ఆ విషయాన్ని ప్రాక్టికల్ జోక్‌గా మామగారు మార్చారు.

తరువాత ఆవిడకి తెలిసిన విషయం ఏమంటే ఎం.ఓ.తో బాటుగా వాళ్ళ ఇద్దరిమధ్య జరిగిన సంభాషణను తమ్ముడికి వివరంగా ఉత్తరంలో వ్రాశారు మామగారు. మొత్తానికి ఇద్దరూ కలిసి ఆవిడని ఒక ఆట పట్టించారు.

–టి.మీనాక్షి.

ఫజిల్స్‌ని ఇష్టపడే
ఆంధ్రజ్యోతి రీడర్స్ కో న్యూస్!
అతి త్వరలో
మీ కోసం–
మీ జ్ఞానానికి పదునుపట్టే
64 కళల 'ఫజిల్' 'పద'నిసలు!
త్వరలో...